



భాగ్యనగర్ కాలనీలో ఇంట్లోకి చేరిన వరద నీరు

కుండపోత

జిల్లాలో 106.2 మి.మీల సగటు వర్షపాతం నమోదు

- స్తంభించిన జనజీవనం
- లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు
- ఆదిలాబాద్ పట్టణంలో నీట మునిగిన పలు కాలనీలు
- పొంగిన వాగులు, వంకలు
- పరవళ్లు పెట్టిన జలపాతాలు
- సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల గేట్ల ఎత్తివేత
- నీట మునిగిన పంటలు అన్నదాతల ఆందోళన



నీటమునిగిన ఆదిలాబాద్‌లోని సుభాష్‌నగర్ కాలని

ఏక ధాటిగా 3 గంటల పాటు కురిసిన కుండ పోత వర్షానికి అంతా అతలాకుతలమైంది. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన అతిభారీ వర్షానికి జిల్లా తడిసి ముద్దయింది. దీంతో వరద బీభత్సవానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో సాయంత్రం వరకు 106.2 మి.మీల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాంసి మండలంలో 173.8 మి.మీల వర్షపాతం కురిసింది. అలాగే తలమడుగులో 170.0, సిరికొండలో 147.0, గుడిహత్నూర్‌లో 148.5, మావలలో 166.5, జైనథ్‌లో 124.3, ఇంద్రవెల్లిలో 122.2, ఆదిలాబాద్ అర్బన్‌లో 150.0, సాత్నాల మండలం 155.8, ఇచ్చోడలో 129.0, ఆదిలాబాద్ రూరల్‌లో 106.0 మి.మీల వర్షపాతం కురిసింది. అలాగే అత్యల్పంగా గాదిగూడ మండలంలో 50.4 మి.మీల వర్షం కురిసింది.

ఆదిలాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. దీంతో సాత్నాల, మత్తడివాగు, చిక్‌మన్ చెరువులు, కుంటలు నిండుకుండలా కనిపిస్తున్నాయి. జిల్లా ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు పెన్‌గంగా నదిలో వరద నీటి ఉధృతి పెరుగుతుంది. ఈ వానాకాల సీజన్‌లో అతిభారీ వర్షం కురవడం ఇదే మొదటి సారి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదిలాబాద్ పట్టణ రోడ్లన్నీ చిన్నపాటి చెరువులను తలపించాయి. చాలా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలను అందించాయి. కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ క్షేత్ర స్థాయిలో పర్యటించి వరదల ఉధృతి, సహాయక చర్యలను పరిశీలించారు.



నాగాపూర్ వాగు వద్ద పరిస్థితులను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

కాలనీలు జలదిగ్బంధం

ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీలు పూర్తిగా జలదిగ్బంధ మయ్యాయి. పంజాబిచౌక్, అంబేద్కర్‌చౌక్, నేతాజిచౌక్‌లో రోడ్లపై వరద నీరు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. సుభాష్ నగర్, రాంనగర్, భాగ్యనగర్,శాంతినగర్, ఓల్డ్ హౌజింగ్ బోర్డు, జీఎస్ ఎస్టేట్, కృష్ణానగర్, ఖోజాకాలనీ, ఇందిరమ్మ కాలనీ, హ్యాండిక్యాప్ కాలనీ, భుక్తాపూర్ కాలనీల్లోకి వరద నీరు చేరి లోతట్టు ఇళ్లలోకి వరదనీరు చేరింది. దీంతో పలు ఇళ్ల లోని వంట సామగ్రి, దస్తులు, తడిసి ముద్దయ్యాయి. ఖోజా కాలనీలో ఓ ఇంటి ముందు నిలిపి ఉంచిన కారు వరద నీటిలో కొట్టుకుపోయింది. భుక్తాపూర్‌లోని నటరాజ్ థియేటర్‌లోకి వరద నీరు చేరడంతో సినిమా షోలను నిలిపి వేశారు. భాగ్యనగర్‌కాలనీలోని ఓ ఇంట్లోకి వరద నీరు చేరి పూర్తిగా తడిసి పోవడంతో ఇంటి సామగ్రిని ఇతర చోటకు తరలించారు. జీఎస్ ఎస్టేట్ కాలనీలోని 53 ప్లాట్‌లోకి వరద నీరు చేరి సామగ్రి తడిసి పోయింది. ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాలలోకి వరద చేరింది. బోథ్ మండలంలోని సహకార సంఘం గోడౌన్‌లోకి వరద నీరు చేరడంతో దాదాపుగా 220 యూరియా బస్తాలు తడిసి పోయాయి.



జలమయమైన ఆదిలాబాద్ పట్టణం



లైట్లు వేసి నడుపుతున్న బస్సు డ్రైవర్



తాంసి మండలంలో తెగిన అంబుగావ్ చెరువు కట్ట

నిలిచిపోయిన రాకపోకలు

ఆదిలాబాద్ నుంచి జైనథ్, బేల వెళ్లే మార్గంలో తర్నం వద్ద లో లెవల్ వంతెనపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు వెళ్లే రాకపోకలు నిలిచి పోయాయి. వరద నీటిలో చిక్కుకున్న లారీ డ్రైవర్‌ను జైనథ్ పోలీసులు కాపాడారు. గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వెళ్లే మార్గంలో తోషం, ముత్నూర్ వద్ద వరద నీటి కాలువలు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలను నిలిపి వేశారు. ఆదిలాబాద్ పట్టణం నుంచి బట్టిసావర్గాం వెళ్లే మార్గంలో పోలీసు కాలనీ వద్ద లోలెవల్ వంతెన ఉప్పొంగి ప్రవహించింది. తలమడుగు మండల కేంద్రానికి సమీపంలో వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలను నిలిపి వేశారు. తాంసి మండలంలోని హస్నాపూర్, పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో లో లెవల్ వంతెనలపై నుంచి వరద ప్రవహించింది.

కడెం నదికి వరద పోటు

నేరడిగొండ మండలంలోని కడెం నదికి వరద ఉధృతి భారీగా పెరిగింది. కుంటాల, పొచ్చెర జలపాతాలు పరవళ్లు పెట్టాయి. కడెం ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. అలాగే గాయత్రి, కనకాయి జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. కడెం నదితో పాటు చాందా, చిక్‌మన్, సాత్నాల, మత్తడివాగులు ఉధృతంగా ప్రవహించాయి. సాత్నాల - మత్తడివాగు ప్రాజెక్టుల వరదగేట్లను ఎత్తివేశారు. సాత్నాల ప్రాజెక్టులోకి 23,152 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో నాలుగు గేట్లను ఎత్తి దిగువకు 27,213 క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. అలాగే మత్తడివాగు (మిగతా 6వ పేజీలో)

దొంగల ముఠా నాయకుల అరెస్టు

జిల్లాలో తొలిసారిగా 313 సెక్షన్ వర్తింపు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణతో పాటు మహారాష్ట్ర లో వరస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా నాయకులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదుదారు టెక్కుల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు దొంగతనం కేసులో దర్యాప్తు చేయాగ.. నేరాలను ప్రవృత్తిగా మార్చుకున్న ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితుడైన చౌహాన్ రవి, సుఖదేవ్ సన్నీ, మైకల్వర్ సాయినాథ్ లను అరెస్ట్ చేశామని, షోహెల్, అము, కరణ్ పరారీలో ఉన్నారన్నారు. అరెస్ట్ చేసిన వారి నుంచి రూ.9,500 నగదు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గ్యాంగ్‌లను ఏర్పాటు చేసి పదేపదే దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై ఏడేళ్ల వరకు కఠిన శిక్ష కలిగిన 313 బీఎన్ఎస్ సెక్షన్ కేసును జిల్లాలో తొలిసారిగా నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశామన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన మావల సీఐ కర్ర స్వామి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై ప్రవీణ్ లను అభినందించారు.

సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సెంట్రల్ వస్తువులకు హౌస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ... రక్తదానంపై అపోహలు వీడి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. మెగా రక్తదాన శిబిరంలో 51 మంది ఉద్యోగులు రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో కార్యాలయ సూపరిండెంట్ విజయ్, ఉద్యోగులు సాయి, కృష్ణ, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా వాజపేయి వర్ధంతి

ఉట్నూర్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి):బీజేపీ ఉట్నూర్ మండల శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజపేయి ఏడవ వర్ధంతి కార్యక్రమం ఉట్నూర్ మండలకేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయిచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ నాయకులు గూగులవత్ శ్రీరామ్‌నాయక్ మాట్లాడుతూ ప్రధానమంత్రిగా వాజపేయి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల పార్టీ అధ్యక్షులు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, మాజీ ఎంపీటీసీ సీపతిలింగాగౌడ్, భారతీయ జనతా పార్టీ మండల నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ఆత్రం సుగుణక్క జన్మదిన వేడుకలు

సిరికొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, అడవి బిడ్డ, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటు ఇంచార్జీ ఆత్రం సుగుణక్క జన్మదిన వేడుకలను సిరికొండ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, మాజీ సరపంచ్ అనిల్ కుమార్, మైనార్టీ చైర్మన్ ఎండి రంజాన్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, ఆత్మ డైరెక్టర్ జింక మల్లేష్, గైక్వాడ్ రాజు, సీనియర్ నాయకులు షేక్ ఇమామ్, కంచం లక్ష్మణ్ ,ఈశ్వర్, ఎండి రసిద్, బాధు పటేల్ ,ఎండి సాజిత్, జెల్ల సతీష్ ,బొడ్డు దత్తు, బియ్యాల రాజేష్, ఎల్లయ్య, భూమన్న, లక్ష్మన్న ,సాయన్న, గురుమూర్తి, బాబు, షేక్ రహీం, జైనుల్ ,హఫీజ్, హైదర్, ఫిరోజ్, ముబారక్, మున్ని ,మంతు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి వర్షం..

- నీట మునిగిన గ్రామాలు, ముంపులో పంటలు
- వాగులు పొంగి స్తంభించిన రాకపోకలు
- సహాయ చర్యల్లో విరివిగా పాల్గొనాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్ /తాంసి/ ఉట్నూర్/ బజార్‌హత్నూర్/ తలమడుగు/ జైనథ్/ ఆదిలాబాద్‌రూరల్ ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్న వేళ పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలకు జనాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యల్లో భాగస్వాలు కావాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న సూచించారు. పట్టణంలోని జై జవాన్ నగర్, చిలకూరి నగర్, మహాలక్ష్మి వాడ తదితర కాలనీ లలో మాజీ మంత్రి పర్యటించారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని కలెక్టర్ రాజర్షి షా ను ఫోన్‌లో కోరారు.

తాంసి మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి అంబుగావ్ చెరువు కట్ట తెగిపోయింది. మండలంలోని అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న హస్నాపూర్ గ్రామం వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పది గంటల పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఉట్నూర్ ఏజెన్సీలో శనివారం ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లలేదు. దంతనపల్లి నుంచి బీరుసాయిపేట వెళ్లే దారిలో దంతనపల్లి వాగు సమీపంలో రోడ్డు పై చెట్టు కూలిపోయి ఉండగా ఆదిలాబాద్ నుంచి మంచిర్యాలకు వె ళ్తున్న ఒక కారు వేగంగా ప్రయాణిస్తూ చెట్టులోనికి దూసుకెళ్లింది. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ నాగపూర్ వాగు వద్దకు చేరుకుని పరిస్థితులు సమీక్షించారు. నాగపూర్, పులిమడుగు నర్సాపూర్ జె, వంకతుమ్మ ప్రాంతాలలోని వాగులు పొంగి ప్రవహించాయి. ఉట్నూర్ పట్టణంలోని మోమిన్ పురాలో ఇండ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంటనే కాంగ్రెస్ నాయకులు నిసార్ ఆధ్వర్యంలో పరిస్థితులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బజార్‌హత్నూర్ మండలంలో మోర్ఖండి, చింతల సాంగ్వి, కొత్తపల్లి వాగులు పొంగి పొర్లాయి. దేగామ, యేసాపూర్, గులాబ్‌తండ, మాడగూడ, ఉప్పర్‌పల్లికి రాకపోకలు నిలిచాయి. జవహర్‌నగర్, ముత్యంపేట, గాంధీనగర్ కాలనీలతో పాటు సుంగుగూడజల్లిగూడ, మాడగూడలో ఇండ్లలోకి నీళ్ల చేరాయి. సాయి లింగి వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. తహసీల్దార్ రాజమోహన్, ఎస్ఐ రాధిక, ఎంపీడీవో శంకర్, వివిధ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల, బోరజ్, జైనథ్ పరిధిలోని ఆయా గ్రామాలలో పెన్‌గంగా నది సాత్నాల నదులు ఉప్పొంగి ప్రవహించడంతో మండలంలోని సాంగ్వి, కౌంట, పెండల్‌వాడ, ఆనంద్‌పూర్,కాప్రీ కరంజి, తర్నం, కామాయి గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తర్నం లోలెవల్ బ్రిడ్జి వద్ద సాత్నాల నది ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. తర్నం బ్రిడ్జి, సాత్నాల నది వరదకు రెండు లారీలు కొట్టుకుపోయాయి. ఆదిలాబాద్‌రూరల్‌లో యాపల్‌గూడ పంచాయతీ పరిధిలోని మత్తడిగూడ చెరువుకట్ట తెగిపోవడంతో చేలలోకి వరద చేరింది. లింగుగూడ, దిమ్మ గ్రామాలలో పంట నష్టం జరిగింది. ఇళ్లలోకి నీరు చేరింది. తంతోలి వాగు పొంగి పొర్లడంతో అంకోలి, లోకారికి పోయే మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి. ఉన్నతంతోలి ప్రాథమిక పాఠశాలలో బియ్యం సంచులు, పుస్తకాలు నీటిలో మునిగి పోయాయి. అంకోలి నుంచి చించుఘాట్ పోయే మార్గంలో బ్రిడ్జి కొట్టుకపోవడంతో చెంచుఘాట్‌కు రాకపోకలు నిలిచి పోయాయి.



హస్నాపూర్ వాగు వద్ద ఎక్కడికి అక్కడ నిలిచిన వాహనాలు



పట్టణంలో నీట మునిగిన కాలనీ



కాలనీ వాసులను సురక్షిత ప్రాంతాలకు చేరుస్తున్న రెస్క్యూటీం



తలమడుగులో నీట మునిగిన పత్తిపంట



సాయిలింగిలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు



వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మాజీమంత్రి జోగురామన్న



భారీ వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్న తలమడుగు పెద్దవాగు



వరదలో బజార్‌హత్నూర్ తహసీల్దార్ కార్యాలయం

ముగిసిన బంజారా తీజ్ పండుగ ఉత్సవాలు



తీజ్ పండుగ ముగింపు పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు



సంపత్ నాయక్ తండాలో నృత్యాలు చేస్తున్న యువతీయువకులు

ఇంద్రవెల్లి/నేరడిగొండ/బోథ్‌ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బంజారా సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా జరుపుకునే తీజ్ పండుగ వేడుకలను శనివారం మండలంలోని హర్కాపూర్ తండాలో బంజారాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బంజారా యువతులు తొమ్మిది రోజులపాటు బుట్టల్లో గోధుమ గింజలు పెట్టి మొలకెత్తిన తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీజ్ వేడుకల ముగింపులో భాగంగా తండాలో డప్పు చప్పుళ్ళ మధ్య నృత్యాలతో సందడి చేశారు. పెళ్లి కాని యువతులు మొలకెత్తిన బుట్టలను నెత్తిన పెట్టుకొని ఊరేగించారు. అనంతరం సమీపంలో ఉన్న చెరువులో మొలకల బుట్టలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భం గా తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూబంజార సభ్యు లం దరికీ తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తు తరా లకు తమ తీజ్ పండుగ ప్రాముఖ్యతను తెలపడానికే ఈ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పండుగ ముఖ్య ఉద్దేశ్యం తరతరాల నుండి వస్తున్న బంజారా సంస్కృతి సాంప్రదాయాలను రక్షించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తీజ్ పండుగ వేడుకల్లో సాంప్రదాయ గిరిజన దుస్తులతో మహిళలతో కలిసి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయక్ చవాన్ ఉమాజీ నాయక్, బంజారా ధర్మ ప్రచార కర్త ఆడే ప్రేంసింగ్ నాయక్, కారోబారి జాధవ్ దుదరాం, గ్రామ పెద్దలు రాథోడ్ రోహిదాస్ నాయక్, జాధవ్ గంగారాం నాయక్, రాథోడ్ సంతోష్ నాయక్‌లు పాల్గొన్నారు. నేరడిగొండలోని మథురనగర్ కాలనీలో కైతీ లంబాడీలు తీజ్ పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు రోజంతా ఉపవాసం ఉండి సంప్రదాయ పాటలు పాడుతూ అనంతరం సంప్రదాయ నృత్యం చేశారు. తమ బంధువులతో కలిసి సామూహిక భోజనాలు చేశారు. తీజ్ పండుగ సందర్భంగా మథురనగర్‌లో పండుగ వతావరణం నెలకొంది.బోథ్‌లోని సంపత్ నాయక్ తండ గ్రామంలో తీజ్ పండుగ వేడుకలను శనివారం రాత్రి భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని సేవాలాల్ మహారాజ్ కు జగదాంబ అమ్మవారిని వేడుకొని పూజలు జరపడం అనవాయితీ. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేసి పండుగ వేడుకలను ముగించారు. కార్యక్రమంలో బంజారా లైవ్ అధ్యక్షుడు యాదవ కృష్ణ, నాయకులు రాథోడ్ ప్రదీప్, మాజీ సర్పంచ్ రాథోడ్, సకారం రాథోడ్, దిలీప్ రాథోడ్ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరు విజేతలే



మాట్లాడుతున్న బేస్ బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఆదిలాబాద్‌టౌన్,ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారుడు విజేతనే అని తెలంగాణ రాష్ట్ర బేస్ బాల్ సంఘం అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బేస్ బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 700 మంది క్రీడాకారులు పాల్గొనగా... వారికి అవసరమైన పూర్తి సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో బేస్ బాల్ క్రీడలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, ఇక్కడ నుంచి రాష్ట్ర జట్టును జాతీయ స్థాయిలో పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రం నుంచి భవిష్యత్తులో బేస్ బాల్ క్రీడాకారులు ఒలంపిక్ స్థాయిలో పాల్గొనేలా శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్‌శ్వేత, జిల్లా అధ్యక్షుడు కలాల శ్రీనివాస్,డీవైఎస్ఓజక్కులశ్రీనివాస్,సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ కృష్ణ,జిల్లాప్రధాన కార్య దర్శి పందిరిజ్యోతి, ఉపాధ్యక్షుడు లోక ప్రవీణ్ రెడ్డి, జిల్లా బీసీసంఘం అధ్యక్షులుదత్తు పాల్గొన్నారు.


ఇస్కాన్‌లో ఏర్పాటు చేసిన రాధాకృష్ణ ప్రతిమలు


శ్రీ కృష్ణుని వేషధారణ



ఉట్టి కొడుతున్న యువకులు

ఘనంగా కృష్ణాష్టమి

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరిగాయి. ఆదిలాబాద్‌లోని మండలాల్లోగల గ్రామాల్లో వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉట్టికొట్టి సంబరాలు చేసుకున్నారు.


కార్యక్రమ అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు


కరంజి(టి)లో...

ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలి : కలెక్టర్

ఇచ్చోడ, ఆగస్టు, 16 (ఆంధ్రజ్యోతి) : ఎడ తెరిపిలేకుండా కురుస్తున్న భారీవర్షం కారణంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలోకి వరదనీరు చేరడంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి శనివారం పాఠ శాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గతంలో టీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల ప్రహరీ కూలిపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పక్కనే ఉన్న వాగు ఉప్పొంగి పాఠశాల ఆవరణలోకి భారీగా వరదనీరు చేరింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెండో అంతస్తులో ఉన్న భవనంలోకి విద్యార్థులను మార్చడం జరిగింది. ఇటీవలే ప్రహరీగోడ నిర్మాణానికి రూ. 60లక్షలు మంజూరు చేయడం జరిగిందని వర్షాకాలం ముగియగానే ప్రహరీ నిర్మించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ సమాచారం అందించాలని తహసీల్దార్ సత్యనారాయణకు ఆదేశాలు జారీచేశారు.


ఇచ్చోడ ఆశ్రమ పాఠశాలలో పరిస్థితులను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే


వరదను పరిశీలిస్తున్న కలెక్టర్

వాగు పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ మొత్తం నీటితో నిండుకోవడంతో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా వైద్యాధికారి నరేందర్ రాఠోడ్‌లో వర్షపు నీటిలో వెళ్లి ఆసుపత్రిని సందర్శించారు. పీహెచ్‌సీలో వరదనీరు చేరడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక సిబ్బందికి సూచించారు. డెలివరీ అయిన గర్భవతులను గుడిహత్నూర్ పీహెచ్‌సీకి తరలించాలని ఆదేశించారు. డెలివరీ కోసం వేచి ఉన్న గర్భిణులను రిమ్స్ ఆసుపత్రికి తరలించాలన్నారు.

సురక్షిత ప్రాంతానికి తరలింపు

గుడిహత్నూర్ : మండలంలో శనివారం తెల్లవారు జామున నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో మండలంలోని సీతగొంది వాగు ఉప్పొంగి ప్రవహించింది. జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ఇంటిలో వాగు వరద నీరు చుట్టూ చేరింది. ఉదయం నుండి గైక్వాడ్ గణేష్ కుటుంబంలోని ఆరుగురు వరదలో చిక్కుకోవడంతో ఇది గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ సంఘటన స్థలానికి చేరుకొని డిడిఆర్ఎఫ్ బృందాలను పిలిచి రెస్క్యూ బృందంచే చిక్కుకున్న బాధితులను సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం వారిని ఆదిలాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి సురక్షితంగా తరలించారు.

నష్టపోయిన పంటకు పరిహారం ఇప్పించాలి

నేరడిగొండ , ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నష్టపోయిన పంటకు పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. శనివారం మండలంలోని కుమారి సమీపంలోని కడెం వాగు నదులు ఉప్పొంగి ఆ నది పరివాహక ప్రాంతంలోని 60 రోజులుగా ఏపుగా పెరిగిన పత్తి సోయాబీన్ పంటలు ముంపుకు గురై రైతాంగం తీవ్ర నష్టాల పాలయ్యారు. ఈ పరిస్థితి నది పరివాహక ప్రాంతాలైన గాజిలి, గాంధారి, కుప్టి, కుమారి, రాయపూర్, ముల్కల్వాడ్. తర్నం, వాగ్దారి, మాదాపూర్, వెంకటాపూర్, కుంటాల గ్రామాల్లో పెట్టిన పెట్టుబడి నీటి పాలైందని రైతులు వాపోయారు.

వీధి దీపాలు అందించిన నాయకులు

ఉట్నూర్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భుక్యాజాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు పులిమడుగు గ్రామంలో వీధి దీపాలు లేక పోవడంతో బీఆర్ఎస్ నాయకులు, పార్టీ సోషల్ మీడియా నాయకులు బాబాశ్యామ్ పంచాయతీ సిబ్బందికి వీధి దీపాలు శనివారం అందించారు. గత కొంతకాలంగా పులిమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామంలో ప్రధానరహదారుల వెంబడి విద్యుత్ దీపాలు లేక అంధకారంలో ఉంది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా ఉండడానికి పులిమడుగు బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు బాబాశ్యామ్ తనవంతు సహాయంగా వీది దీపాలు, వైర్ హోల్డర్లు అందించారు.

స్తంభించిన జన జీవనం

ఇంద్రవెల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, పొలాల్లోకి నీరు చేరి జలమయమయ్యాయి. ఈ వర్షం కారణంగా ప్రజల సాధారణ జీవితం స్తంభించింది. మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీలో 10 మంది ఇంట్లో వరద నీరు చేరడంతోప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముత్నూర్ త్రివేణి సంగమం కాలువ ఉప్పొంగి పోవడంతో సమీపంలో గల ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వెళ్లే రోడ్డును అనుకుని ప్రవహించడంతోరోడ్డు చాలా వరకు తెగిపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

సాయినగర్ కాలనీని సందర్శించిన తహసీల్దార్

బోథ్ : మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో శనివారం బోథ్ తహసీల్దార్ సుభాష్ చంద్రతో పాటు ఆత్మ చైర్మన్ జి. రాజు యాదవ్, సహకార సంఘం డైరెక్టర్ సి. ఉమేష్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో పరిశీలించి నీట మునిగిన గృహాల వారితో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. ఆందోళన చెందవద్దని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండలంలోని మరల పెళ్లి గ్రామం సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌తెగి వాగులో పడిపోయింది. అయితే దీంతో 18 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాట్నాపూర్ లీడర్‌కు అసిస్టెంట్ లైన్‌మెన్ నిర్వహిస్తున్న గోపి సకాలంలో స్పందించారు. విషయం తెలుసుకున్న వెంటనే శనివారం కొద్దిగా ఉధృతి తగ్గడంతో వెంటనే వాగు దాటి విద్యుత్తు లైన్ మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో లైన్‌మెన్ సేవలను పలువురు అభినందించారు.

వాగు దాటి వైద్యం

సిరికొండ , ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వచ్చిందంటే చాలు అటు ప్రజలకు.. ఇటు అధికారులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. శనివారం మండల పరిధిలోని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి హిమబిందు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నారాయణ్ పూర్ గ్రామ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నా గర్భిణీల వైద్య పరీక్షల నిమిత్తం లో లెవల్ వంతెన దాటి ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో దాదాపు 30 మంది రోగులకు, గర్భిణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్ గంగారాం, ఏఎన్ఎం రేణుక, ఆశా కార్యకర్త, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ మాసం సందడి

కుంటాల, ఆగస్టు, 16 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓలా శివాలయం, సూర్యాపూర్‌లోని రాజరాజేశ్వర ఆలయం, కుంటాల మహాదేవుని, ఉమా మహేశ్వర ఆలయాల్లో శనివారం శ్రావణ మాసం సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో కుంటాలకు చెందిన కక్కెర ముత్యం రావు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

సిరికొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎలాంటి ఆందోళనకు గురికావద్దని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం సిరికొండ మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పి ప్రభుత్వం నుంచి సహాయం అందించే విధంగా చూస్తానని భరోసా ఇచ్చారు. అయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, మాజీ మండల అధ్యక్షులు కంచం లక్ష్మణ్, సీనియర్ నాయకులు షేక్ ఇమామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుండపోత

(5వ పేజీ తరువాయి)

ప్రాజెక్టులోకి 31,124 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో 5 గేట్లను ఎత్తి 42,860 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువకు వదిలేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

నీట మునిగిన పంటలు

భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని పత్తి, సోయా, కంది ఇతర పంటలు పూర్తిగా నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా 10వేల ఎకరాలలో పూర్తిగా పంటలు నీట మునిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలతో పూతదశలో ఉన్న పత్తి పంటదెబ్బతినే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. చాలా గ్రామాలలో పంటలు నీటమునిగే కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల పంట పొలాలు వరద ఉధృతికి కోతకు గురై నేలమట్టమయ్యాయి. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న పంటలను వరదలు నీట ముంచడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

క్షేత్ర స్థాయిలో ఎమ్మెల్యేలు

భారీ వర్షం కారణంగా నీటమునిగిన ప్రాంతాలను ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్‌జాదవ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ, జీఎస్ ఎస్టేట్ కాలనీ, రూరల్ మండలంలోని యాపల్‌గూడ, అంకోలి, తంతోలి గ్రామాల్లో పర్యటించి వరద ముప్పు ప్రాంతాలను పరిశీలించారు. అలాగే బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఇచ్చోడ మండల కేంద్రంలోని పలు ప్రాంతాలతో పాటు బోథ్ మండల కేంద్రంలో పర్యటించారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ధైర్యం చెప్పారు. పలు ఇండ్లలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న కాలనీ వాసుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

అధికార యంత్రాంగం అలర్ట్

ఏకధాటిగా కురిసిన అతిభారీ వర్షానికి అంతా అతలాకుతలం కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. స్వయాన జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ క్షేత్ర స్థాయిలో పర్యటించి సహాయక చర్యలను దగ్గరుండి పరిశీలించారు. గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామంలో ఓ ఇంట్లోకి వరద నీరు చేరడంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించి ఆరుగురు కుటుంబ సభ్యులను కాపాడారు. అలాగే ఇచ్చోడ గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాలను సందర్శించారు. జిల్లా కేంద్రంలోని కుమ్మరికుంట, మావల మండలంలోని మణిపూర్ కాలనీలోని పలు ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో పరిస్థితిని పరిశీలించి సహాయక చర్యలను చేపట్టారు. భారీ వర్షాలు, వరదల కారణంగా అత్యవసర సమయంలో 18004251939 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసి అత్యవసర సేవలను అందించారు. జిల్లాలో ఎలాంటి ప్రాణాప్రాయం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

ఆందోళన చెందవద్దు, ఆదుకుంటాం : ఎమ్మెల్యే

బోథ్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో వరద ఉధృతి వల్ల నష్టపోయిన కుటుంబాల వారిని శనివారం సాయంత్రం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఈ సందర్భంగా వరద తాకిడి వల్ల నష్టపోయిన వారి ఇంటికి వెళ్లి పరామర్శించాడు. ఆందోళన చెందవద్దని ఉపాధ్యాయులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతేగాక బాధితులకు ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఆయన వెంట మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, డాక్టర్ రవీంద్ర ప్రసాద్ ఉన్నారు.

ప్రత్యేక పూజలు

బోథ్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మండలంలో పలు గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతనతో కూడిన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. పోచ్చేర గ్రామంలో హనుమాన్ ఆలయంలో పగలు, రాత్రి సప్తహ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా సోనాల మండల కేంద్రంలో రామాలయం వద్ద భక్తులు భజన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇక బోథ్ మండలంలోని కౌటా (బి) గ్రామంలో హనుమాన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భజన కార్యక్రమాలను నిర్వహిస్తుండగా శబరి మాత ఆలయంలో హరినామ సంకీర్తనతో పాటు పురాణ కాలక్షేపణ నిర్వహిస్తున్నారు. అంతేగాక భక్తులు శబరిమత పాదపూజ కార్యక్రమాలను చేపడుతున్నారు. అఖండ జ్యోతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని శబరిమత ఆలయాలలో భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

శ్రీ శారదా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నిర్మల్ రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : శారదా వెల్ఫేర్ అసోసియేషన్ (2001-2002 పదవ తరగతి) నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షులు అదుముల్లా శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడిగా ఓడ్నాల వేద ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా అడపాశ్యామ్, క్యాషియర్‌గా సిలారి సతీష్ కుమార్, సెక్రటరీగా పురుషోత్తం, సలహా సభ్యులుగా రాజ్‌కుమార్, ఉమాకాంత్, రామకృష్ణ, రాజేందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

భైంసా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో బిల్లులు చెల్లించి వైద్యసేవలు పొందిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి బాసటగా నిలుస్తుందని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల వాసులకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరయిన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కుంటాల, ఆగస్టు, 16 : (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని లింబా (బీ) గ్రామానికి చెందిన గాండ్ల సాయినాథ్ (40) అనే ఆటోడ్రైవర్ శనివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై అశోక్ తెలిపారు. సాయినాథ్‌కు గత 20 ఏళ్ల క్రితం రజిత అనే అమ్మాయితో వివాహం జరిగిన సంతానం కాలేదు. దీంతో మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఆయన వెల్లడించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

వాజపేయి వర్ధంతి

నిర్మల్ రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించినట్లు పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆడెపు సుధాకర్, ఉపాధ్యక్షులు అలివేలు మంగ, కమల్‌నయన్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ దశరథ్ పోశెట్టి, ఆడెపు లలిత, మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ అయ్యన్నగారి రాజేందర్, ఆడెపు లలిత పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్ : అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, నాయకులు ముత్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, ఆకుల కార్తీక్, పట్టణ నాయకులున్నారు.

లంబాడా సంప్రదాయాల ప్రతిబింబం 'తీజ్'


కాల్వ తండాలో తీజ్ బుట్టలు తయారు చేస్తున్న లంబాడాలు


బుట్టలు ఎత్తుతున్న పెద్దలు


తండా పెద్దల పూజలు

● తండాల్లో ప్రారంభమైన ఉత్సవాలు

దిలావర్‌పూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : లంబాడాలు ప్రతియేటా సంప్రదాయబద్ధంగా జరుపుకునే తీజ్ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తీజ్ పండుగ లంబాడా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. తరతరాల నుంచి ఆచారాలను నిలిపి ఉంచుతూ ప్రకృతితో వారి అనుబంధాన్ని, సామాజిక ఐక్యతను చాటి చెబుతోంది. తీజ్ పండుగను సాదారణంగా శ్రావణ మాసంలో రాఖీ పౌర్ణమి నుంచి కృష్ణాష్టమి వరకు మరికొన్ని చోట్ల కృష్ణాష్టమి నుంచి పొలాల అమావాస్య వరకు 9 రోజులు జరుపుకుంటారు. ప్రధానంగా లంబాడా సమాజంలో పెళ్లికాని యువతులు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. మంచి భర్త లభించాలని, మంచి పంటలు పండాలని, సమాజంలో సంపద, ఐశ్వర్యం కలగాలని ప్రార్థిస్తారు.

తీజ్‌తో ప్రకృతి ఆరాధన...

తీజ్‌ప్రకృతిని ఆరాధించే పండుగల్లో ప్రధానమైంది. పచ్చదనానికి, సమృద్ధికి ఈ పండుగ ప్రతీక. అందుకే తీజ్‌ను 'లంబాడా బతుకమ్మ' 'గడ్డి బతుకమ్మ' అని కూడా పిలుస్తారు. ఈ పండుగలో లంబాడాలు ప్రధానంగా సేవాలాల్ మహారాజ్, మేరామ యాడి (పార్వతీ దేవి మరో రూపం), సీత్ల భవానిలను పూజిస్తారు.

తీజ్ బుట్టల తయారీ...

తీజ్ పండుగ ప్రారంభానికి ముందు రోజు తండానాయక్ అనుమతితో యువతులు మట్టిని సేకరించి చిన్న వెదురు బుట్టలు, మోదుగ ఆకుల బుట్టల్లో నింపుతారు. వీటిని తీజ్ బుట్టలుగా పిలుస్తారు. ఈ బుట్టల్లో గోధుమ విత్తనాలను చల్లుతారు. ఈ విత్తనాలు 9 రోజులలో మొలకలు వచ్చి ఏపుగా పెరుగుతాయి. మొలకల పెరుగుదల మంచి పంటకు, శుభాకానికి సంకేతంగా నమ్ముతారు. ఏ. యువతి బుట్టలో గోధుమ మొలకలు ఏపుగా, పచ్చదనంతో ఉంటాయో ఆ యువతికి మంచి భర్త దొరుకుతాడని నమ్ముతారు.

తీజ్ పండుగ నియమాలు, పూజలు...

తీజ్ ప్రారంభం నుంచి తొమ్మిది రోజుల పాటు పెళ్లికాని యువతులు నిష్టతో ఉపవాసం ఉంటూ రోజుకు మూడుసార్లు బావులు, నదుల నుంచి నీటిని తెచ్చి ఆ మొలకలకు పోస్తారు. సేవాలాల్, జగదాంబ దేవిలకు నియమ నిష్టలతో పూజలు చేస్తారు. తీజ్ పండుగలో పాటలు, నృత్యాలకు చాలా ప్రాధాన్యతనిస్తారు. రంగు రంగుల లంబాడా సంప్రదాయ దుస్తులు ధరించి, యువతులు డప్పు చప్పుళ్లకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ, తీజ్ పాటలు పాడుతారు.

తీజ్‌లో ఏడు, ఎనిమిది రోజులకు ప్రాధాన్యత...

తీజ్ పండుగలో ఏడవ, ఎనిమిదవ రోజులకు చాలా ప్రాధాన్యత ఉంది. ఏడవ రోజున ప్రతి ఇంట్లో బియ్యంపు పిండితో రొట్టెలు చేసి బెల్లం, నెయ్యితో కలుపుతారు. దీనిని కుల దేవుడైన సేవాభయ్యకు నివేదిస్తారు. ఎనిమిదవ రోజున యువతులు చెరువు నుండి మట్టిని తెచ్చి ఆడ, మగ బొమ్మలను తయారు చేసి వీరికి వివాహం జరిపిస్తారు. ఈ వేడుకను గణగోర్ అని పిలుస్తారు. 'గణ' అంటే వారి కులదేవత మేరామ యాడి, 'గోర్' అంటే కుల దేవుడు సేవాభయ్య

తీజ్ బుట్టల నిమజ్జనం...

తొమ్మిదవ రోజును 'తీజ్ తోడేరో దాడో' అని పిలుస్తారు. యువతులు తాము పూజించిన తీజ్ బుట్టలను తలపై పెట్టుకుని, సంప్రదాయ నృత్యాలు చేస్తూ, ఊరేగింపుగా వెళ్లి దగ్గరలో ఉన్న నది, లేదంటే చెరువులో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం తర్వాత బంధుమిత్రులతో కలిసి విందును ఏర్పాటు చేస్తారు. తొమ్మిదవ రోజుతో పండుగ ముగుస్తుంది.

శివాలయంలో ముస్లిం యువకుడి పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న లతీఫ్

నర్సాపూర్(జి), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి చెందిన యువకుడు లతీఫ్ అనే ముస్లిం యువకుడు స్థానిక స్వయంభు శ్రీచక్ర లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసంలో శివాలయాలు భక్తులతో కళకళలాడుతున్న సమయంలో లతీఫ్ స్వయంగా శివలింగానికి హారతి ఇచ్చి భక్తి ప్రవత్తులు చాటుకున్నారు. పూజల అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదం పంపిణీ చేసి, మతం వేరైనా మనందరి లక్ష్యం ఒకటేనని చాటి చెప్పారు. టెంబుర్ని గ్రామంలో మత సామరస్యం కొత్తేమీ కాదు. ఇక్కడ హిందూ, ముస్లిం పండుగలు అందరూ కలిసి జరుపుకుంటారు.

కాల్వ ఆలయంలో భక్తుల సందడి


నరసింహ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దిలావర్‌పూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. శ్రావణ మాసం నాలుగో శనివారం అందులో శ్రీకృష్ణ జన్మాష్టమి కావడంతో ఆలయ ప్రాంగణం స్వామివారి నామస్మరణతో మార్మోగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ధర్మకర్తల మండలి తగిన ఏర్పాట్లు చేసింది. నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి అదుముల్లా గంగాధర్ భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయంలో భక్తుల రద్దీని దిలావర్‌పూర్ పోలీసులు క్రమబద్ధీకరించారు. మహా అన్నప్రసాద వితరణ చేసిన అదుముల్లా గంగాధర్‌ను దేవస్థానం ధర్మకర్తల మండలి ఘనంగా సన్మానించింది. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మహేందర్, ఇతర సభ్యులు, జూనియర్ అసిస్టెంట్ మనోహర్ భక్తులకు సేవలు అందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

భైంసా రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భారీ వర్షాలు కురువడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ నైలు సూచించారు. బోరిగాం, పేండ్‌పెల్లి, గుండెగాం, హజ్గుల్ గ్రామాల్లో వరద ప్రవహాన్ని పరిశీలించారు. శనివారం, ఆదివారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. కాబట్టి లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదే విధంగా గడ్డెన్న వాగు ప్రాజెక్టు గేట్లు నీరు వదలడంతో భారీ నీరు రావడంతో పశువుల కాపర్లు, మేకల కాపర్లు ముందు జాగ్రత్తతో ఉండాలన్నారు.

నర్సాపూర్(జి)లో తహసీల్దార్ పర్యటన

నర్సాపూర్(జి), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో నర్సాపూర్(జి) మండలంలో స్థానిక ఎమ్మార్వో శ్రీకాంత్, ఎస్సై గణేష్‌లు విస్తృతంగా పర్యటించారు. ముఖ్యంగా మట్టి ఇళ్లలో నివసిస్తున్న వారి వద్దకు వెళ్లి వర్షాల తీవ్రత దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. గ్రామ పెద్దలతో మాట్లడి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కడెం ప్రాజెక్టులో గల్లంతైన కడెం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ కుటుంబాన్ని వారి ఇంటికి వెళ్లి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అధికారులకు పరివాహక ప్రాంత ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.


శ్రీకృష్ణ భగవాన్‌కి పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


కృష్ణుడు, గోపిక వేషధారణ

ఉత్సాహంగా..

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరిగాయి. నిర్మల్ పట్టణంలోని గండి రామన్న సాయి బాబా ఆలయం ఆవరణలో శ్రీకృష్ణ భగవాన్‌కి హారతి ఇచ్చారు. నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్‌లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలలో గోపిక, కృష్ణుడిగా లక్ష్మణచాంద మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష కుమారులైన అయిరా, యామిలు ఆకట్టుకున్నారు. కుభీర్, లక్ష్మణచాందలోని మునిపెల్లి, దిలావర్‌పూర్‌లో సిర్గాపూర్ ప్లేయర్ హైస్కూల్, ముథోల్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో, హిందూ వాహిని, ఉత్సవ కమిటీ వేడుకలను నిర్వహించారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు


కుస్టిలోకీర్తనలు పాడుతున్న భక్తులు


చాందా గ్రామంలో నీటమునిగిన బెల్లూరి అయ్యప్ప ఆలయం


కుంటాల జలపాతం వద్ద వరద


మత్తడి వాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పరవళ్ళు తొక్కుతున్న వరద


గడ్డెన్న ప్రాజెక్టు గేట్ల నుంచి సుద్దవాగులోకి వదులుతున్న వరద

భారీ వర్షాలకు

స్తంభించిన జనజీవనం

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో ఎడతెరపి లేని వాన
- ప్రాజెక్టుల్లోకి భారీగా చేరుతున్న వరద
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- తాంసీలో 143 సె.మీ. వర్షపాతం నమోదు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పర్యటన

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేని వానతో ప్రాజెక్టుల్లో భారీగా వరద వచ్చి చేరుతోంది. నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. చెరువులు, వాగులు జలకళను సంతరించుకున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు పర్యటిస్తూ సూచనలిస్తున్నారు.


గడ్డెన్న ప్రాజెక్టును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్


సిరికొండలో వరదకు కొట్టుకుపోయిన మొక్కజొన్న పంట

తాంసి, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలంలో శనివారం ఉదయం నుంచి భారీవర్షం కురిసింది. కుండపోత వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. తాంసి, కప్పర్ల, పొన్నారి, గిరిగావు గ్రామాల్లోకి వరద భారీగా చేరింది. ఇళ్లల్లోకి నీరు రావడంతో జనం పరుగులు తీశారు. మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోవడంతో అప్రమత్తమైన అధికారులు ఐదుగేట్లు పైకి ఎత్తారు. సుమారు 42 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. వర్షానికి ఆయా గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. దినమంతా కరెంటు సరఫరా నిలిపివేశారు. పంట పొలాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో పత్తి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. తాంసిలో 142 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

నేరడిగొండ: మండలంలో కురిసిన భారీవర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగాయి. కడెం నది పరివాహక ప్రాంతాలలో పంటలకు నష్టం వాటిల్లింది. సేవదాస్ నగర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. కుప్టివద్ద కడెం నది ఉగ్రరూపం దాల్చింది. కోర్టికల్, కుంటాల జలపాతాలకు భారీ వరద చేరింది. ఎవరూ జలపాతం వైపు వెళ్లొద్దని అటవీ, పోలీసు శాఖల అధికారులు ఆంక్షలు విధించారు.

నీట మునిగిన పంటలు

సిరికొండ: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. సిరికొండ మండల కేంద్రంతోపాటు రాంపూర్ (బి), పొన్న, నారాయణ్ పూర్, నేరడిగొండ (జి) తదితర గ్రామాల్లో ఉదయం ఒక్కసారిగా వాగుల్లో వరద పెరిగింది. నీరు పెరగడంతో పత్తి, మొక్కజొన్న, సోయా పంటలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. కొండాపూర్ గ్రామసమీపంలోని చిక్మాన్‌వాగుకు వచ్చిన వరదతో వంతెన వద్ద తాత్కాలికంగా నిర్మించిన మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో సిరికొండ నుంచి ఇంద్రవెల్లి వెళ్ళే ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దార్ తుకారాం, ఎస్సై పూజ, సర్వేయర్ గణేష్ పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

గుడిహత్నూర్: మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. తోషం బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు రెండు గంటల అంతరాయం ఏర్పడింది. మండలకేంద్రంలోని మహంకాళి, టాకీగూడ గ్రామాల్లో పలువురి ఇళ్లలోకి వరద చేరింది. గుడిహత్నూర్‌లో వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వరద తాకిడికి రోడ్డు కోతకు గురైంది.

ఇచ్చోడ: మండలంలోని కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల కేంద్రంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, టీటీడబ్ల్యూఆర్ పాఠశాల, కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాల భవనాలు నీటిలో మునిగిపోయాయి.

నార్నూర్: నార్నూర్, గాదిగూడ మండల వాగులు పొంగిపొర్లుతున్నాయి. చిత్తగూడ, దన్నుగూడ, బాబేఝరి, మంజరి, చోర్గవ సుంగపూర్, ఖైర్దత్వాలో కోర్డినేటింగ్ బ్రిడ్జి, మేడిగూడ, దాబా, పరిసర ప్రాంతాల బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తోంది. ఖడ్కివాగు వద్ద ప్రజలు దాటకుండా పోలీస్ సిబ్బంది బారికేడ్లను ఏర్పాట్లుచేశారు. ఎంపల్లిఘాట్ ముడుపులవద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో ఆశ్రమపాఠశాల ఝరి హెచ్ఎం రవీందర్ అదుపు తప్పిపడిపోయాడు.

బోథ్: మండలంలోని దన్నూర్ గ్రామ పరిసరాల్లో ఉన్న వాగులు వరదతో ప్రవహిస్తున్నాయి. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీసాయితో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. బోథ్, సోనాలలో వాగులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. చింతలబోరి వాగు ఉప్పొంగి ప్రవహించడంతో 11గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బ oదుల ఏర్పడ్డాయి. సాయినగర్ కాలనీలోని పలువురి ఇళ్లలోకి నీరుచేరింది. అప్రమత్తమైన అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలకేంద్రంలోని సహకారసంఘం గోదాంలో వరదనీరు చేరింది. ఫలితంగా దాదాపు 210 వరకు బస్తాలు నానిపోయాయి.

బాసర: బాసర వద్ద గోదావరి నది వరద ప్రభావం తీవ్రమవుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో వరద నీరు భారీగా వచ్చి చేరడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి నదిలో స్నానాలు చేసేందుకు శివాలయం సమీపంలోని స్నానఘట్టం వద్ద మాత్రమే అనుమతి ఇస్తున్నారు. అదికూడా లోపలికి వెళ్లకుండా కఠిన ఆంక్షలు విధించారు.

భైంసా: గడ్డెన్న ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. శనివారం 5వరద గేట్లను ఎత్తి సుద్దవాగులోకి 20వేల క్యూసెక్కుల నీటిని వదిలేశారు. నీటిని సుద్దవాగులోకి వదిలివేయడంతో అక్కడి ప్రాంత పంట పైర్లు దెబ్బతిన్నాయి.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ఆదిలాబాద్‌టౌన్: వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పర్యటించారు. స్థానిక మహాలక్ష్మీ వాడ, తిర్పెల్లి, జి.ఎస్ ఎస్టేట్ తదితర కాలనీలో పర్యటించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలపై మున్సిపల్ కమిషనర్ రాజుకు విస్తృత సూచనలు చేశారు. వందల ఎకరాలు దెబ్బ తిన్నాయని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు పరిహారం అందించాలని పేర్కొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో సబ్‌కలెక్టర్ పర్యటన

వరద ముంపు పొంచి ఉన్న ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ పర్యటించారు. భైంసాలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ అమర్ ప్రతాప్ సింగ్‌లు కలిసి గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లి వరద పరిస్థితిని సమీక్షించారు. అంతర్గత రోడ్లు, ప్రధాన రోడ్ల మార్గంలో వర్షపు నీరు నిల్వ కుండా ఎలాంటి ముంపు సమస్యలు ఏర్పడకుండా ఉండేందుకు గాను తక్షణమే ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్‌ను ఆదేశించారు. అలాగే వరద నీటితో ముంపు పొంచి ఉన్న నేపథ్యంలో భైంసా ఆర్టీసీ డిపో అధికారులు అప్రమత్తమయ్యారు.

భీంపూర్: మండలంలో భారీ వర్షం కురిసింది. పిప్పల్‌కోటి మోడ్‌వద్ద, బీంపూర్‌నుంచి గుంజల వెళ్లే వాగు, అంతర్గవ్ గ్రామంలో ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పెన్ గంగ ఉధృతంగా ప్రవహిస్తోంది.


ఆదిలాబాద్‌లోని పాత జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద


తాంసిలో నీటమునిగిన పత్తి పంట


గుడిహత్నూర్ మండలం టాకీగూడలోని ఓ ఇంటిలో చేరిన వరద


ఇచ్చోడలోని సిరిచెల్మ పరిధిలో నీట మునిగిన పత్తిపంట, మొక్కజొన్న


గోదాంలో యూరియా బస్తాల కింద నిలిచిపోయిన వరద నీరు


వరద ప్రభావిత కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్


బాసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది


అలుగు పారుతున్న కరత్వాడ చెరువు


ఉప్పొంగి ప్రవహిస్తున్న పొచ్చెర జలపాతం



ఖడ్కిలో కోర్డినేటింగ్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బారికేడ్లు

నిజాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద

- మంజీరా వెంట 31 వేల క్యూసెక్కుల వరద
- నిజాంసాగర్‌లో 8.678 టీఎంసీలకు చేరిన నీటి సామర్థ్యం
- ప్రాజెక్టు నిండుతుండడంతో రైతుల్లో హర్షం


నిజాంసాగర్ ప్రాజెక్టు

నిజాంసాగర్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. మంజీరా వెంట 31 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టులో క్రమంగా నీటి నిల్వ పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలకు 8.678 టీఎంసీలు ఉంది. సింగూరు ప్రాజెక్టు వరద గేటు ఈనెల 13న రాత్రి 11వ గేట్‌తో పాటు జెన్కో గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లలోని మరో నాలుగు గేట్లను ఎత్తి శనివారం నుంచి 43,176 క్యూసెక్కుల వరదని నిజాంసాగర్‌కు మంజీరా వెంటా విడుదల చేస్తూ ఉన్నారు. సింగూరు ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతాల ద్వారా 31,412 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ఈ ప్రాజెక్టు గేట్లలోని 6, 8, 9, 10, 11 గేట్లనే ఎత్తి 40821 క్యూసెక్కుల వరద నీరు శంకు గేట్ ద్వారా 2380 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సింగూరు ప్రాజెక్టులో 29.917 టీఎంసీలకు గాను 21.849 టీఎంసీల నీటి సామర్థ్యానికి చేరుకుంది. వర్షాలు కురుస్తూ ఉండటంతో సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిన నిండుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఉమ్మెడ తీరం వద్ద నదిలో ప్రవహిస్తున్న వరద


ప్రస్తుత నీటి నిల్వతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

ఎస్సారెస్పీకి జలకళ

మెండోర, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద పెరుగుతోంది. ఈ సందర్భంగా ప్రాజెక్టులోకి 1,04,879 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని పేర్కొన్నారు. పర్యాటకులు ప్రాజెక్టు అందా లను తిలకించడానికి ప్రాజెక్టుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగుల 80 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రానికి 1083.00 అడుగుల 53.62 టీఎంసీల నీటినిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూన్ 1నుంచి ప్రా జెక్టులోకి 4టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నిండుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మెడ గోదావరిలో వరద ఉధృతి

నందిపేట: మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న గోదావరి నదిలో వరద ఉధృతి పెరిగింది. నందిపేట మండలం ఉమ్మెడ, నిర్మల్‌లోని లోకేశ్వరం మండలం పంచగుడి శివారుల మధ్యలో ఉన్న గోదావరి నదిపై నిర్మించిన వంతెనను వరద తాకుతున్నట్లు కనిపిస్తోంది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా విష్ణుపురి, బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తిరు. దీంతో ఆ ప్రాజెక్టుల నీరు దిగువకు ప్రవహించడంతో ఉమ్మెడ తీరంలో ఉన్న గోదావరి నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరింత వరద పెరిగితే గట్టునఉన్న పురాతన ఆలయం శ్రీ ఉమామహేశ్వర ఆల యం మునిగిపోతుందని స్థానికులు చెప్తున్నారు. ఇప్పటికే వరద నీరు ఆల యం సమీపానికి చేరింది. నదిలో నీటి ప్రవాహం పెరగడంతో వంతెనపై ప్రయాణికులు ముఖ్యంగా యువత సెల్ఫీలు దిగుతున్నారు.

మంజీరాకు చేరిన వరద

సాలూర: మంజీరా నదికి వరద చేరింది. దీంతో సాలూర కింది బ్రిడ్జి నుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మంజీరకు భారీ వర్షపు నీరుచేరింది. దీంతో మంజీరాపాత వంతెన నుంచి నీరు ప్రవహిస్తోంది. మరో రెండు రోజులు భారీవర్షాలు ఉన్నాయన్న సూచనలతో ప్రయాణికులు అటు వైపుగా వెళ్లకుండా అధికారులు అప్రమత్తమై తగు చర్యలు చేపడుతున్నారు.





గడ్డెన్న ప్రాజెక్టు వరద గేట్లు నీటిని వదులుతున్న దృశ్యం



కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం



స్వర్ణ ప్రాజెక్టు ఆరు గేట్ల ద్వారా వరద నీరు విడుదల

కురిసింది వాన..


- మూడు ప్రాజెక్టులకు భారీగా పెరుగుతున్న వరద
- కడెం ప్రాజెక్టులోకి 1.95 లక్షల క్యూసెక్కులకు పైగా..
- స్వర్ణ ప్రాజెక్టులోకి 18,200ల క్యూసెక్కుల వరద
- గడ్డెన్న వాగు ప్రాజెక్టు 5 గేట్ల ఎత్తివేత

పెంబిలో అత్యధికంగా 49 మిల్లీమీటర్ల వర్షపాతం

నిర్మల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం జిల్లా సగటు వర్షపాతం 17.7 మి.మీ. నమోదైంది. దీంతో ప్రాజెక్టుల్లోకి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి చేరుతున్న వరద నీటితో క్రమేపి ప్రాజెక్టుల నీటి మట్టం పెరుగుతోంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1,95,973 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా ఉండగా మొత్తం ప్రాజెక్టుకు సంబంధించిన 18 గేట్లు ఎత్తి దిగువకు రెండు లక్షల 14,730 క్యూసెక్కుల నీరును వదులుతున్నారు. జిల్లాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.658 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 10,500ల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రాజెక్టు 5 వరద గేట్లను ఎత్తి 20,000ల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.037 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 18,200 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రాజెక్టు 6 వరద గేట్లను ఎత్తి 29,305 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పెంబి మండలంలో అత్యధికంగా 49 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో స్వర్ణ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. నిర్మల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీని జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల సందర్శించారు. నిర్మల్ రూరల్ మండలంలోని కౌట్ల(కే) గ్రామంలో కూలిపోయే దశలో ఉన్న ఇళ్లలో నివాసం ఉంటున్న నాలుగు కుటుంబాలకు పాఠశాలలో పోలీసులు పునరావాసం కల్పించారు. కడెం మండలం లోని అటవీ ప్రాంతంలోని అల్లంపెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరదలో చుట్టుపక్కల రైతుల విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయినట్లు రైతులు చెబుతున్నారు. అల్లంపెల్లి నుంచి మంగళ్‌సింగ్ తండాకు రాకపోకలు నిలిచిపోయాయి.

కడెం ప్రాజెక్టులో ఒకరి గల్లంతు

కడెం ప్రాజెక్టులోకి చేపలు పట్టేందుకు వెళ్లిన కన్నాపూర్ వాసి గంగాధర్ అనే వ్యక్తి వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. ఆయన నది మధ్యలో చేపలు పడుతుండగా అప్పటి కే గేట్లు వదలడంతో వరద నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో ఆయన ఆ నీటిలో చిక్కుకున్నాడు. క్రమంగా ఉధృతి పెరగడంతో ఒక్కసారి నీటిలో గల్లంతయ్యాడు. రక్షించేందుకు స్థానికులు, పోలీసులు ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఆయన కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు గాలింపు జరుపుతున్నాయి.



నిర్మల్ మండలం కౌట్ల (కే) గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు

పరిస్థితులను సమీక్షించిన కలెక్టర్

కడెం, స్వర్ణ ప్రాజెక్టుల్లోకి వరద పెరగడంతో అక్కడికి కలెక్టర్ అభిలాష అభినవ్ చేరుకున్నారు. మొదట స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ అక్కడ అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం కడెం ప్రాజెక్టును సందర్శించారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్, శివంగి బలగాలు సిద్ధం...

కాగా కడెం ప్రాజెక్టులోకి గంట గంటకు ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా అధికార యంత్రాంగం అంతా అప్రమత్తమైంది. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ శివంగి బలగాలను కడెం ప్రాజెక్టు వద్ద మోహరించారు. సందర్శకులను ఎవరిని కూడా ప్రాజెక్టు వద్దకు అనుమతించడం లేదు.



నిర్మల్‌లో పునరావాసం కల్పించిన దృశ్యం



స్వర్ణ ప్రాజెక్టు నీటి ఉధృతి



తెగిపోయిన కౌట్ల(కే) వాగు బ్రిడ్జి

కడెం ఉగ్రరూపం



నిండు కుండలా కనిపిస్తున్న కడెం ప్రాజెక్టు

- పోటెత్తిన వరద 18 గేట్ల ఎత్తివేత
- రెండు లక్షల పైచిలుకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఖానాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి కడెం ప్రాజెక్టు ఈ ఏడాదిలో తొలిసారి తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. ఎగువన భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి క్రమేపి వరద నీరు పోటెత్తింది. వరద ఉధృతి పెరుగుతుండడంతో ఉదయం నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలిన అధికారులు మధ్యాహ్నానికి 17 గేట్లను ఎత్తారు. సాయంత్రానికి వరద ఉధృతి మరింత పెరగడంతో పూర్తిస్థాయిలో మొత్తం 18 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700ల అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 692.650 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.001 టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టులోకి 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టుకు ఉన్న పూర్తిస్థాయి 18 వరద గేట్లను ఎత్తి దిగువకు 2,04,183 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు గేట్లు అన్ని ఎత్తడంతో నది పరివాహక ప్రాంతంలోకి ఎవరు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అధికారులు ఓవైపు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ కన్నాపూర్‌కు చెందిన తిప్పారెడ్డి గంగాధర్ అనే వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నాడు. వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో బయటకు వచ్చేందుకు అవకాశం లేక వరద నీటిలో కొట్టుకుపోయారు. ఆయన ఆచూకీకోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రయత్నిస్తున్నాయి. శనివారం సాయంత్రానికి గల్లంతైన వ్యక్తి ఆచూకీ దొరకలేదు.

ఇన్ ఫ్లో... అవుట్ ఫ్లోలను సమపాళ్లలో...

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో భారీగా ఉందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం సాయంత్రం కడెం ప్రాజెక్టును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కడెంకు వరద నీరు తాకిడి మరింత పెరగవచ్చని ఆ వరద ఉధృతి తగ్గే వరకు ఇరిగేషన్ అధికారుల సూచనలతో కడెం ప్రాజెక్టు గేట్లు తెరిచే ఉంచుతామన్నారు. ఇప్పటికే ప్రాజెక్టు కింది గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా టామ్ టామ్ (డప్పు చాటింపు) వేయించామన్నారు. ప్రాజెక్టు అన్ని గేట్లను ఎత్తడం ద్వారా ప్రస్తుతానికి కడెం ప్రాజెక్టు వద్ద పరిస్థితి సురక్షితంగా ఉందన్నారు. ఆమె వెంట జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఏఎస్పీ రాజేష్ మీనా తదితరులు ఉన్నారు.

ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే..

కడెం ప్రాజెక్టు 18 గేట్లు ఎత్తడంతో శనివారం ప్రాజెక్టు వద్ద పరిస్థితిని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరు నది పరివాహక ప్రాంతంలోకి వెళ్లవద్దని ఎమ్మెల్యే కోరారు. గతంలో ఉన్నటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు.

ఫొటోలు, సెల్ఫీలు వద్దు : ఎస్పీ

వరద ఉధృతి పెరిగిందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల సూచించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆమె ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రాజెక్టుల వద్దకు, వాటర్ ఫాల్స్ వద్దకు నీటి ఉధృతిని చూడడానికి వచ్చి ప్రమాదకర ప్రదేశాల్లోకి వెళ్లి సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని ఆమె హితువు పలికారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

చైన్‌స్నాచర్ పట్టివేత

- కేసు వివరాలు వెల్లడించిన భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసా, ఆగస్టు 16 : సబ్‌డివిజన్ పరిధిలోని లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకున్న చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు 24గంటల వ్యవధిలో ఛేదించినట్లుగా ఏఎస్పీ అవినాష్ కుమార్ వెల్లడించారు. శనివారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం వేళలో లోకేశ్వరం మండలంలోని వాస్తాపూర్ గ్రామానికి చెందిన యమున అనే మహిళ అబ్దుల్లాపూర్ గ్రామ సమీపంలోని రోడ్డు మార్గంలో పశువులను మేపుతుండగా చైన్‌స్నాచింగ్ బారిన పడింది. ఆ రోడ్డు మార్గం మీదుగా ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు ఒకరు యమునకు మాయమాటలు చెప్పి ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసుతో ఉడాయించాడు. సంబంధిత ఘటనపై కేసునమోదు చేసుకున్న లోకేశ్వరం ఎస్సై అశోక్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సాయిప్రశాంత్, లక్ష్మణ్‌లతో కలిసి కేసును ఛేదించేందుకు గాను ప్రతిష్ఠాత్మకంగా వ్యవహరించారు. ఇందులో భాగంగానే అక్కడి ప్రాంతంలోని సీసీ ఫుటేజీని పరిశీలించి నేరస్తుడిని గుర్తించేందుకు లోతుగా విచారణ చేపట్టారు. సీసీ కెమెరా రికార్డు ఆధారంగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నేరస్తుడు ముథోల్ మండలంలోని ఆష్టాగ్రామానికి చెందిన పిప్పెర విజయ్‌ని గుర్తించి పట్టుకున్నారు. 24గంటల వ్యవధిలోనే నేరస్తుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. నేరస్తుడిని పట్టుకున్న అనంతరం చైన్‌స్నాచింగ్ ఘటనలో అపహరించిన బంగారు గొలుసుతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక్కరోజు వ్యవధిలోనే కేసును ఛేదించిన లోకేశ్వరం ఎస్సై అశోక్‌తో పాటు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిలా అభినందించినట్లుగా ఏఎస్పీ అవినాష్ కుమార్ వెల్లడించారు. సమావేశంలో ముథోల్ సీఐ మల్లేష్, లోకేశ్వరం ఎస్సై అశోక్‌లున్నారు.

ఝరి(బి) గ్రామం వద్ద పరిస్థితిని పరిశీలించిన ఏఎస్పీ

తానూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఝరి(బి) గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వాగు పొంగిపోయిన నేపథ్యంలో శనివారం పరిస్థితిని ఏఎస్పీ అవినాష్‌కుమార్ పరిశీలించారు. సీఐ మల్లేష్, ఎస్సై షేక్ జుబేర్‌తో కలిసి ఆయన గ్రామానికి చేరుకొని బ్రిడ్జి వద్ద పరిశీలించారు. ప్రజల రాకపోకలను, భద్రతను దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా వాగుకు ఇరుపక్కల మధ్యలో ఒక తాడును కట్టించి, తాడు సహాయంతో రాకపోకలు సాగించే విధంగా ఏర్పాట్లు చేశారు. అదే విధంగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రజలు సురక్షితంగా ప్రయాణించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజల భద్రతే లక్ష్యమని అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఝరి(బి) బ్రిడ్జి వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసులు

నీట మునిగిన పంటలు



భైంసా ప్రాంతంలో కుంటను తలపిస్తున్న పంట చేను

భైంసా,ఆగస్టు 16 : జిల్లా వ్యాప్తంగా శనివారం వానలు దంచి కొట్టాయి. వేకువ జామున వేళలో ప్రారంభమైన వరుణుడి జోరు సాయంత్రం వరకు ఏకధాటిగా కొనసాగింది. భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువులు, కుంటలను తలపించాయి. వివిధ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడం మూలంగా రాకపోకలకు అటంకాలు ఎదురయ్యాయి. పంట చేలలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఆయా పంట పైర్లన్నీ జలమయమయ్యాయి. శనివారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జిల్లాలోని 30 ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెంబి కేంద్రంలో 48 మి.మీ, కుంటాలలో 41 మి.మీ. అబ్దులాపూర్‌లో 39.8 మి.మీ, ముథోల్ 38 మి.మీ, తాండ్ర 36.5 మి.మీ, ఎడ్‌బిడ్ లో 35.8 మి.మీ, విశ్వనాథ్ పేట్ 35 మి.మీ, బాసరలో 34.3 మి.మీ, భైంసాలో 33.5 మి.మీ, జాంలో 32.5 మి.మీ, మామడలో 31 మి.మీ, ఖానాపూర్‌లో 30.8 మి.మీ, పాక్‌పట్ల 30 మి.మీ, దిలావర్‌పూర్, అక్కపూర్, దస్తూరాబాద్ కేంద్రాల్లో 29.8 మి.మీ, ముజ్గిలో 27.5 మి.మీ, లింగాపూర్‌లో 26.5 మి.మీ, పాత ఎల్లాపూర్ 25.5 మి.మీ, కడెంలో 24.3 మి.మీ, వడ్యాల్ 23.8 మి.మీ, నర్సాపూర్ (జీ) 22 మి.మీ, కుభీర్ 20 మి.మీ, వానల్‌పాడ్ 18.3 మి.మీ, బీరవెల్లి, తానూర్ 17 మి.మీ, లక్ష్మణచాంద 10 మి.మీ, లోకేశ్వరం 4.5 మి.మీటర్లుగా వర్షపాతం నమోదైంది.

ఎన్డీఆర్ఎఫ్ అప్రమత్తం



సబ్‌కలెక్టర్‌తో వరదపరిస్థితిని పరిశీలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్

భైంసా, ఆగస్టు 16 : జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు గాను ఎన్డీఆర్‌ఎఫ్ బృందం అప్రమత్తమైంది. శనివారం ఎన్డీఆర్‌ఎఫ్ నిర్మల్ జిల్లా బృందం కమాండర్ అమర్ ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని ఎన్డీఆర్‌ఎఫ్ బృందం వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని అంచనా వేసింది. ముంపు ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు గాను అప్రమత్తమై నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే శనివారం ఎన్డీఆర్‌ఎఫ్ నిర్మల్ జిల్లా బృందం కమాండర్ అమర్ ప్రతాప్ సింగ్ గడ్డెన్న వాగు ప్రాజెక్టు వరద నీటి ముంపు ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌లతో సమావేశమయ్యారు. వర్ష, వరదల ప్రభావంపై మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గడ్డెన్న ప్రాజెక్టు వద్దకు వెళ్లి క్షేత్ర స్థాయిలో వరద పరిస్థితిని పరిశీలించారు. అక్కడి నుండి ముంపు ముప్పు పొంచి ఉన్న రాహుల్ నగర్ ప్రాంతానికి వెళ్లి అక్కడి ప్రాంత వాసులతో మాట్లాడి వారందరిని జాగృత పర్చారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్‌ఎఫ్ జిల్లా కమాండర్ అమర్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరం లేని ప్రయాణాలను మానుకోవాలని తెలిపారు. వరద ముంపు ఏర్పడితే సమాచారం అందిస్తే తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందం పడవలు, లైఫ్ జాకెట్, అత్యవసర చికిత్స సామాగ్రితో వరద ప్రమాద పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సన్నద్ధమయ్యాయని తెలిపారు. వరద ముంపు ముప్పుపై ప్రజలు ఆందోళన చెందవద్దని, ఎలాంటి అత్యవసర సేవలకైన తమ బృందం సర్వం సిద్ధంగా ఉందన్నారు.

కొత్త చెరువును పరిశీలించిన బృందం

దిలావర్‌పూర్ : ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో వరద నీరు చేరికతో దిలావర్‌పూర్ కొత్త చెరువు ప్రమాదపు అంచుకు చేరుకుంది. దీంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో గోవర్ధన్, దిలావర్‌పూర్ పంచాయతీ ఈవో చంద్రశేఖర్‌లు కొత్త చెరువును సందర్శించి పరిశీలించారు. చెరువు తూము మరమ్మతు జరుగుతుండగా వరద నీరు చేరికతో ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికి ప్రమాదమేమి లేదని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తహసీల్దార్ అన్నారు.

పునరావాస కేంద్రానికి తరలింపు



శిథిలావస్థలో ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్ రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌట్ల(కే) గ్రామంలో పురాతన ఇళ్లు, కూలిపోయే దశలో ఉన్న ఇళ్లల్లో నివాసం ఉంటున్న నాలుగు కుటుంబాలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించినట్లు రూరల్ సీఐ కృష్ణ తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను సందర్శించి అందులో నివాసం ఉంటున్న కుటుంబాలతో మాట్లాడారు. మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఏ క్షణంలోనైనా ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున వెంటనే ఆయా కుటుంబాలను ఖాళీ చేయించి వారిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై లింబాద్రి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండండి



ప్రాజెక్టు అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

- స్వర్ణ పరివాహక ప్రాంత ప్రజలకు కలెక్టర్ సూచన

సారంగాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ నది పరివాహక ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం స్వర్ణ ప్రాజెక్టు పరిశీలించి ప్రాజెక్టు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలు పశువుల కాపరులు, రైతులు, చేపలు పట్టే మత్స్యకారులు నది పరివాహక ప్రాంతాల వైపు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వస్తున్న వర్షాల కారణం వల్ల ఏవయిన ఇబ్బందులలు తలెత్తితే కలెక్టర్ కార్యాలయంలోలో ఏర్పాటు చేసినటువంటి కంట్రోల్ రూమ్ నెంబర్ 9100577132 నెంబరుకు సంప్రదించి సమాచారాన్ని అందించాలన్నారు. అలాగే చించోలి యం, వంజర్ గ్రామాల మదుగా ప్రవహిస్తున్న నదిని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌తోపాటు అధికారులు ఉన్నారు.

ధర్మాజీపేట్ రహదారి వద్ద పడిన చెట్టు



రహదారిపై పడ్డ భారీ వృక్షం

కడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా కడెం మండలంలోని ధర్మాజీపేట్ సమీపంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు ప్రజలకు తెలిపారు.

కుంటాలలో భారీ వర్షం



వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తున్న కల్లూరు చెక్‌డ్యాం

కుంటాల, ఆగస్టు, 16 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు, ఓలా, అందకూ ర్, కుంటాల, లింబా (కే), అంబకంటి గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. కల్లూరు చెక్‌డ్యాం పరవళ్లు తొక్కు తూ ప్రవ హించింది. 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయికృష్ణ తెలిపారు.